# లిఫ్ట్!!

"శ్రీహరి గార్మెంట్స్ అండ్ సూట్ స్టిచింగ్ సెంటర్... ఇన్వైట్స్ యూ.."

ఇన్విటేషన్ కార్డు చదువుతున్న శ్రీహరి మళ్లీ మొదటికి వచ్చాడు. 'శ్రీహరి గార్మెంట్స్...' ఇన్విటేషన్ చివర్లో పేరు- కె.బి. రాజు... మధ్యలో చదివాడు- ఇనాగరేషన్ బై శ్రీమతి లలితా శ్రీహరి. కార్డు చదువుతున్న శ్రీహరికి కళ్లల్లో నీళ్లు తగిలాయ్! రాజు 6 ఏళ్ల క్రితం తను స్కూటర్ మీద వెళ్తుంటే....

✦ ✦ ✦

"లిఫ్ట్ ప్లీజ్!" రోడ్డు రొదలో వినిపించలేదు గానీ రిక్వెస్ట్ చేస్తున్న

లేత మొహం అందుకు తగిన బాడీ యాక్షనూ చూసి జాలేసి స్కూటర్ ఆపాడు శ్రీహరి!

"ఎటెల్తావ్..."

"ఫిలిమ్ నగర్ వైపు- మీరు ఎంతదాకా వెళ్తే అంతదాకా దింపండి. నేనక్కణ్నుంచి..."

"ఫిలిమ్ నగర్‌లో ఎక్కడికి వెళ్తావ్"

రాజు వెంటనే జవాబు చెప్పలేదు. మళ్లీ అడిగాడు శ్రీహరి.

"ఎక్కడికీ అంటే జవాబు లేదు లెండి. ఆ ఏరియాలోనే నిర్మాతలూ, దర్శకులూ, యాక్టర్లూ ఉంటారుగా- అన్ని చోట్లకీ వెళ్లాలి. పని అడగాలి. నాలుగు నెలల నుంచి నాది ఆ రోడ్డే... ఆ రూటే.."

'సినిమా పిచ్చోడన్నమాట' అనుకున్నాడు శ్రీహరి. నవ్వాపుకున్నట్టు తెలియకుండా "ఏం చేద్దామని ఇంట్రస్టు నీకు..." అన్నాడు.

"నేను స్కూల్లో నాటకాలు వేసేవాణ్ని"

'ఓహో... చిరంజీవి కంచం లాగేద్దామనుకున్నాడన్నమాట' అనుకుంటూ నవ్వుకున్నాడు.

"ఏం చదివావు?"

"పది పోయిందండి"

'పోదామరి సినిమా పిచ్చిలో పడితే' అనుకున్నాడు శ్రీహరి.

"మీ నాన్న ఏం చేస్తారు?"

"టైలరండి- రాజమండ్రిలో"

"నువ్ ఇంట్లో చెప్పే వచ్చావా?''

"చెప్తే రానియ్యరు కదా''

ఇలా జరిగిన సంభాషణలో శ్రీహరి డొంక తిరుగుడు ప్రశ్నలకి రాజు ఇచ్చిన సమాధానాలు స్ట్రెయిట్‌గా, కాన్ఫిడెంట్‌గా ఉన్నాయి. శ్రీహరికి చాలా ముచ్చటేసింది. తనకీ ఓ కొడుకు ఉంటే, ఈ వయసు వాడై వుండేవాడు. పెళ్లయి ఇరవై ఏళ్లు గడిచినా వాళ్లింట్లో పసి ఏడుపు వినిపించలేదు. పిల్లాడి కోసం రాజు తండ్రిలా బెంగెట్టుకునే బాధ లేదు. 'హాయిగా చీకూ చింతా లేకుండా ఉన్నాంలే' అని లలితా తనూ ఎన్ని వందల సార్లో అనుకుని ఒకొళ్లనొకళ్లు ఓదార్చుకున్నారు. ఇప్పుడీ అబ్బాయిని చూడగానే చీకో చింతో చికాకో చిక్కో ఏర్పరచుకోవాలని అనిపించింది.

"ఎన్ని డబ్బులు ఇంట్లోంచి ఎత్తుకొచ్చావ్'' పోలీసులా అడిగాడు శ్రీహరి.

"నేను దొంగతనం చేయను సార్! ఒక్క రోజు రాత్రి రెండు పేంట్లూ రెండు షర్టులూ కుట్టాను. మూడు వందల రూపాయలు ఇచ్చారు. అది నా కష్టార్జితం''

"వెరీగుడ్. నీకు స్టిచింగ్ వచ్చన్నమాట. రోజుకి మూడొందల రూపాయల పని చెయ్యగలవన్నమాట''

"యస్ సార్... మా నాన్నకన్నా ఫాస్ట్‌గా పెర్‌ఫెక్ట్‌గా కుడతాను''

శ్రీహరికి అతని మీద ఆసక్తీ, అభిమానం కలిగింది.

ఫిలిమ్ నగర్ వచ్చింది స్కూటర్. "సరేలే- నేను సాయంత్రం వచ్చి నిన్ను ఇక్కడే పికప్ చేసుకుంటా... ఇంతకీ నీ రూమ్ ఎక్కడ''

శ్రీహరి ప్రశ్నకి రాజు జవాబు చెప్పలేకపోయాడు.

రాజు చెప్తూన్న జవాబులు విని ఆ ప్రశ్న అడగడం తప్పనుకున్నాడు శ్రీహరి. ఖచ్చితంగా ఇదీ నా రూమ్ అనే చోటు లేదు అతనికి. ఎలా ఉంటున్నాడో, ఎక్కడ భోజనం చేస్తున్నాడో, ఇంకెన్ని డబ్బులు మిగిలాయో... ప్రశ్నలు అడగక్కర లేకుండా జవాబులు ఊహాకందాయి.

ఎవర్ని ఏ ప్రశ్న వెయ్యకూడదో హృదయం ఉన్నవాడికి బాగా తెలుస్తుంది. అలా అడగని వాడికి జవాబు ఊహించే శక్తి ఉంటుంది. ఫైనల్‌గా.. "సరిగ్గా ఐదు గంటలకి ఇక్కడే వుండు. నాకు రెండు జతలు బట్టలు కుట్టాలి. నీ కుట్టు కూలి నీకు ఇచ్చేస్తాను. మా ఇంట్లో మిషన్ వుంది" అని అతన్ని ఓ స్టేట్యూ దగ్గర దింపేశాడు.

శ్రీహరికి ఆరోజు ఆఫీసుకెళ్లానిపించలేదు.

సంతోష్ బ్రదర్స్ షాపుకెళ్లి రెండు జతల పేంటూ, షర్ట్ గుడ్డలు కొన్నాడు. ఇటూ అటూ తిరిగి సాయంత్రం చెప్పిన టైముకి అతన్ని నిలబడమన్న చోటికి వెళ్లాడు.

+ + +

రాజు చకా చకా పని మొదలెట్టి రాత్రి పన్నెండు గంటలకల్లా ఓ జత బట్టలు కుట్టేశాడు. మధ్యలో భోజనానికి పిలిస్తే మొహమాటపడిలేచి అన్నం తిని మళ్లీ మిషన్ ఎక్కాడు. అతని కమిట్‌మెంట్, చాకచక్యం, కాన్ఫిడెన్స్ చాలాసేపు నిద్రమాని, శ్రీహరి, లలిత చూశారు.

శ్రీహరికి నిద్ర కమ్ముకొచ్చినా, లలిత అతని పనితనానికి ముగ్ధురాలైపోయి నిద్రమాని అతని దగ్గరే కూచుంది. తర్వాత్తర్వాత రాజు శిష్యురాలైపోయింది.

ఎప్పుడో కొని మూలపడేసిన మిషన్‌కి జవసత్వాలు వచ్చాయి.

ఆవేళ్టినుంచి రాజుకి వాళ్ల ఇంట్లోనే బస.

కొన్నాళ్లు సినిమా ప్రయత్నాలు చేసుకున్నాడు.

ఆ తర్వాత శ్రీహరి చూపించిన గార్మెంట్స్ షాపులో బట్టలు కుట్టడానికి కుదిరాడు. నెలకి మూడు వేలు జీతం. కొంత డబ్బు ఇంటికి కూడా పంపించేడు. సినిమా పిచ్చి పూర్తిగా పోయింది.

ఎడ్రస్సు లేకుండా బతికేయాలని పారిపోయి వచ్చిన రాజుకి ఇప్పుడు రెండు ఎడ్రస్సులు... తను పనిచేస్తున్న షాపూ, ఇంకా శ్రీహరిగారి ఇంట్లో మెట్లకింద రూమూ.

రాజు ఫుల్‌టైమ్, ఓవర్‌టైమూ చేస్తూ, మరి రెండు షాపుల్లో పార్ట్ టైమ్ చేస్తూ చాలా బిజీ అయిపోయాడు. రాత్రి కూడా రాజు భోజనానికి ఇంటికి రాకపోతే లలిత బెంగెట్టేసుకునేంత కలిసిపోయాడు.

ఏ రోజుకారోజు, ఏ నెలకా నెల సంపాదించే డబ్బులు ఇంటికి పంపంగా మిగిలేవన్నీ లలితే దాచి పెట్టేది. కొన్నాళ్లు పోయాక జాయింట్ ఎకౌంట్‌లో వేసింది లలిత.

శ్రీహరి, లలితకో కాలక్షేపాన్ని చూసాడో లేదా రాజుకి అమ్మని ఏర్పాటు చేసాడో... తెలియదుగానీ తనకి పని తగ్గిపోయింది. ఆ తర్వాత ప్లానంతా వాళ్ల ఇద్దరి మధ్యా జరిగింది.

లలిత అర్థరాత్రి నిద్రలేచి- "రాజు సొంతంగా స్టిచింగ్ సెంటర్ పెడితే ఎలా వుంటుందండీ" అనేది.

"ఏవండోయ్! సూటు కుట్టడంలో మనవాడు సిటీలోనే నెంబర్ వన్‌టండీ..." అనేది.

నిజమే రాజు చేసే ఫ్యాన్సీ డిజైన్స్ స్టిచింగ్ టెక్నిక్ గొప్ప పేరు పొందుతున్నాయి.

రాజు చేస్తున్న ఉద్యోగాలు మానేశానని చెప్పిన రోజున 'వీడికి సినిమా పిచ్చి పోలేదన్నమాట' అనుకున్నాడు శ్రీహరి.

కానీ- అతను ఉద్యోగం మానేసిన కొన్నాళ్లకి ఇన్విటేషన్ కార్డు చేతిలో పడింది.

రాజు గార్మెంట్స్ అండ్ సూట్ స్టిచింగ్ సెంటర్ పెడుతున్నాడు.

ఆ కార్డు చూసి శ్రీహరి థ్రిల్లైపోయాడు. కళ్లలో నీళ్లు తిరిగాయి. షాపుకి తన పేరు... ఆ షాపుకి ఆవిష్కర్త లలితా శ్రీహరి!

శ్రీహరి దంపతులు ఇద్దరూ మహదానందంతో రెడీ అయి ఫంక్షన్ కెళ్లారు. లలితా శ్రీహరి రిబ్బన్ కట్ చేసింది. వీళ్ళిద్దరికన్నా ఎందరో చీఫ్ గెస్టులు!!

కానీ ముందస్తు గౌరవం లలితా శ్రీహరికే ఇచ్చాడు రాజు.

'శ్రీహరి గార్మెంట్స్ అండ్ సూట్ స్టిచింగ్ సెంటర్'

బోర్డ్ చూస్తూనే శ్రీహరి కళ్లు చెమ్మగిల్లాయి.

'డోంట్ గివ్ ఫిష్ టు ఎనీబడీ- టీచ్ హిమ్ హౌ టూ కేచ్ ఏ ఫిష్' అని మామయ్య కొడుకు శాస్త్రిగాడు చెప్పిన మాట వేదంలా తోచింది. ఆ మాట నిజమైంది అనుకుని చెమ్మగిల్లిన కళ్లతో ఉన్నాడు శ్రీహరి. రాజుకి ఆ స్లోగన్ తెలీదు కానీ... అలాగే చెమ్మగిల్లిన కళ్లతో లలితకీ శ్రీహరికీ దణ్ణం పెట్టాడు- అక్షింతలు వేయమంటూ, వాళ్ల ఆనందాశ్రువుల ముందర అక్షింతలు ఏపాటి.

